జలమండలి అధికారుల వివరాలు

చందానగర్‌: హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి దుర్గం చెరువు, హఫీజ్‌పేట్‌ డివిజన్లలో మంచినీటి, సివరేజ్‌ సమస్యలు ఉంటే కింద అధికారులకు తెలియజేయవచ్చు....

'దుర్గం చెరువు' 15 డివిజన్‌ జనరల్‌ మేనేజర్‌ బ్రిజేష్‌ : 9989989679

మాదాపూర్‌ సబ్‌ డివిజన్‌..

శరత్‌కుమార్‌రెడ్డి (డీజీఎం, మాదాపూర్‌) : 9989988370

బి.యాదయ్య (మేనేజర్‌, మాదాపూర్‌) : 9154297400

సందీప్‌కుమార్‌ (మేనేజర్‌, కొండాపూర్‌) : 9550731232

విక్రమ్‌రెడ్డి (మేనేజర్‌, దోయన్స్‌) : 9989989382

నల్లగండ్ల సబ్‌ డివిజన్‌..

నరేందర్‌రెడ్డి (డీజీఎం/మేనేజర్‌, గచ్చిబౌలి) : 7331185784

అభిషేక్‌ (మేనేజర్‌, నల్లగండ్ల): 9154867438

'హఫీజ్‌పేట్‌' 17 డివిజన్‌ జనరల్‌ మేనేజర్‌ నారాయణ : 9989988615

మియాపూర్‌ సబ్‌ డివిజన్‌ ..

వెంకటేశ్వర్లు డీజీఎం(మియాపూర్‌) మేనేజర్‌ (హఫీజ్‌పేట్‌) : 9989997518

సునీత (మేనేజర్‌, మియాపూర్‌) : 9154867431

ఎస్‌వీఎస్‌ సుబ్రమణ్యం రాజు (మేనేజర్‌, చందానగర్‌) : 9989989045

బిక్కులాల్‌ (మేనేజర్‌, దీప్తిశ్రీనగర్‌) : 7995010492

ఆర్సీపురం సబ్‌ డివిజన్‌ :

శివకృష్ణ (డీజీఎం/మేనేజర్‌, పటాన్‌చెరువు) : 7337350848

అభిషేక్‌ (ఇంచార్జి మేనేజర్‌, ఆర్సీపురం) : 9154867438

మంచినీటి ట్యాంకర్‌ కోసం : 155313

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 50, దొండ 30, దోస 40, ఆలు 30, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్‌ 100, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 50, క్యాబేజీ 15, క్యారెట్‌ 40, చిక్కుడు 70, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

మే 30 వరకు సమ్మర్‌ క్యాంప్‌



విజేతలను అభినందిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని పీజేఆర్‌ స్టేడియంలో సమ్మర్‌ క్యాంప్‌ ప్రారంభమైందని సర్కిల్‌ 21 ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో కరాటేలో గెలుపొందిన వారిని ఆయన అభినందించారు. ఈ శిక్షణ మే 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఇండోర్‌, అవుట్‌డోర్‌, బ్యాడ్మింటన్‌, క్రికెట్‌, వాలీబాల్‌ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తారన్నారు.

చెత్త తొలగింపు



రేగులకుంట చెరువు వద్ద చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్‌..

మియాపూర్‌: మియాపూర్‌లోని కాలనీ, బస్తీలలో చెత్త చెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. సోమవారం సాక్షి దినపత్రికలో ఎక్కడపడితే అక్కడ చెత్త అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన పారిశుద్ధ్య విభాగం అధికారులు సిబ్బందితో చెత్తను తొలగింపు చేశారు. ఆయా ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానాలు విధిస్తామని బోర్డులు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి ఆదిశంకరుని జయంతి ఉత్సవాలు

మోతీనగర్‌: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారద శంకరమఠంలో బుధవారం నుంచి మే 2వ తేదీ వరకు ఆది శంకరుని జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు గురువందనం, గురుపాదుకా పూజ, ఆదిశంకరుల మూలవిరాట్‌కు అభిషేకం, ఆలయంలో నిత్య పూజలు, పారాయణాలు, పంచాయతన పూజలు, హోమాలు, శోభాయాత్ర, ప్రవచనం, స్వస్తి తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.



గుల్‌మొహర్‌పార్కు కాలనీ చౌరస్తా

జంక్షన్‌ విస్తరణపై జర దృష్టి పెట్టండి

గుల్‌మొహర్‌పార్కు కాలనీ ప్రాంతంలో గణనీయంగా పెరుగుతున్న వాహనాల రద్దీ

2022లోనే ప్రతిపాదన చేసినా ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు

శేరిలింగంపల్లి: లింగంపల్లి–గచ్చిబౌలి రూట్లో ఇప్పుడిప్పుడే ప్రాధాన్యతను సంతరించుకుంటున్న గుల్‌మొహర్‌పార్కు కాలనీ జంక్షన్‌ను విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్‌ పెరుగుతున్న దృష్ట్యా విస్తరణ అవశ్యం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. గుల్‌మొహర్‌ పార్కు జంక్షన్‌ సమీపంలో క్యాండియర్‌ నిర్మాణ సంస్థ 50 అంతస్థుల భవనం, మరో నిర్మాణ సంస్థ 30 అంతస్థుల భవనంతో పాటు పలు అపార్ట్‌మెంట్లు, గేటెడ్‌ కమ్యూనిటీలు, డూప్లెక్స్‌ విల్లాలు అందుబాటులోకి రానున్నాయి.దీంతో వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అపార్టుమెంట్లు, విల్లాలు అందుబాటులోకి వస్తే కార్లు, ద్విచక్ర వాహనాల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. ట్రాఫిక్‌ పోలీసులు ఈ గుల్‌మొహర్‌ జంక్షన్‌ను విస్తరించాలని భావించినా అధికారుల బదిలీతో ఈ ప్రతిపాదన అలాగే ఉంది.

2022లో ఆర్‌డీపీ కింద ప్రతిపాదన..

జంక్షన్‌ ఇంప్రూవ్‌మెంట్‌ కింద 2022లో రోడ్‌ డెవలప్‌మెంట్‌ ప్లాన్‌ ద్వారా నగరంలో పది జంక్షన్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అందులో గుల్‌మొహర్‌ పార్కు కాలనీ జంక్షన్‌ను కూడా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. 150 ఫీట్ల రోడ్డు విస్తరణ కూడా చేయాలని భావిస్తున్నారు. ఇందులో ఒకవైపు 6 ఆస్తులు, మరోవైపు 14 ఆస్తులను సేకరించాలని ఇప్పటికే నిర్ణయించినా పురోగతి కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జానపద సాహిత్యం కొత్త పుంతలు తొక్కింది



అతిథులను సత్కరించిన సదస్సు నిర్వాహకులు

రాయదుర్గం: జానపద సాహిత్యం 70 ఏళ్లలో అనేక మలుపులు తిరిగిందని ద్రవిడ విశ్వవిద్యాలయం జానపద అధ్యయన శాఖ పూర్వ పీఠాధిపతి ఆచార్య పులికొండ సుబ్బాచారి పేర్కొన్నారు.ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగు శాఖ మంగళవారం రామరాజు సాహిత్య పరిశోధనపై సదస్సు నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన తెలుగుశాఖ హెచ్‌సీయూ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ జానపద సాహిత్య అధ్యయనానికి బిరుదురాజు రామరాజు పరిశోధనా కృషియే పునాది అని పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్‌ నామోజు బాలాచారి, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్‌ ఆచార్య టి గౌరీశంకర్‌ మాట్లాడుతూ అనేకమంది పరిశోధకులను ప్రోత్సహించిన ఉదాత్త వ్యక్తిత్వం రామరాజుగారిదన్నారు. తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిరుదురాజు రామరాజు రచించిన ఆంధ్రయోగులు గురించి మాట్లాడారు. భారతీయ ఆధ్యాత్మిక కృషిని ఆ గ్రంథంలో వివరించారని ఆయన సోదాహరణంగా పేర్కొన్నారు. బిరుదురాజురామరాజు తెలుగులో జానపద గేయ సాహిత్యంలోని వివిధ అంశాలను డాక్టర్‌ డి విజయకుమారి తన పత్రసమర్పణలో పేర్కొన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న వారిని ఘనంగా సత్కరించారు. శాస్త్రవేత్త డాక్టర్‌ రూప్‌కుమార్‌, ఆచార్యులు డి విజయలక్ష్మి,పమ్మి పవన్‌కుమార్‌, వంగరిత్రివేణి, డాక్టర్‌ భూక్య తిరుపతి, డాక్టర్‌ భుజంగరెడ్డి, డాక్టర్‌ విజయకుమార్‌,పరిశోధక,సాహితీ విద్యార్థులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



ఆల్విన్‌కాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ పరిధి భాగ్యనగర్‌ కాలనీలో దాసరి శ్రీనివాసరావు, ప్రసన్నల జ్ఞాపకార్థం మంగళవారం రాహుల్‌ దాసరి ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హోప్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ కొండా విజయ్‌ ముఖ్య అతిథిగా హాజరై మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి తీవ్రత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా మజ్జిగ పంపిణీ చేయ కార్యక్రమంలో దయాసాగర్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, హరికుమార్‌, హరికృష్ణ, సతీష్‌ నాయుడు, బుల్లెట్‌ రవి, రవీందర్‌ పాల్గొన్నారు.

రోడ్లపై బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేస్తే చర్యలు



మియాపూర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య అధికారులు

మియాపూర్‌: రోడ్ల పక్కన స్తంభాలకు, గోడలకు, డివైడర్‌ మధ్యలో స్టిక్కర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదని, ఓ వేళ ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని చందానగర్‌ సర్కిల్‌ వైద్యాధికారి డాక్టర్‌ రవి తెలిపారు. చందానగర్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్‌ రవి పర్యవేక్షణలో పారిశుద్ధ్య అధికారులు హోటళ్లు, వాణిజ్య కేంద్రాల్లో మంగళవారం తనిఖీలు చేశారు. శుభ్రత పాటించని ..డస్టబిన్‌లు లేని వాటికి జరిమానాలు విధించారు. రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త వేసిన వారికి జరిమానాలు విధించారు. రోడ్డు పక్కన కటౌట్‌ ఏర్పాటు చేసిన నవ్య సింపని నిర్మాణ సంస్థకు రూ.2లక్షల 50వేలు, దీప్తిశ్రీనగర్‌లోని ఓ పాఠశాలకు రూ.25వేలు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. కాగా రోడ్లపై ఏర్పాటు చేసిన బ్యానర్లు, కటౌట్లు తొలగించి వేశారు. మరలా ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఆర్‌పి కనకరాజు, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్‌: తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి, సంగారెడ్డి, జోగిపేట, బాచుపల్లి మహాత్మా జ్యోతి బాపూలే కళాశాలలో ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ నవనీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఉన్నాయని, పదవ తరగతి మార్కులు ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. మే 12వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉందని తెలిపారు.

మేడేను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్‌: మేడేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని శ్రామికభవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డేను పటాన్‌చెరు నియోజకవర్గంలో విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయరాం, దుర్గా, చంద్ర కిరణ్‌సింగ్‌, జయకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ విషయంలో అధికారుల తాత్సారం

ఆల్విన్‌కాలనీ: ఎల్‌ఆర్‌ఎస్‌ విషయంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని ధరణీనగర్‌ వాసులు ఆరోపిస్తున్నారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్‌కాలనీ ధరణినగర్‌ వాసులు ఎల్‌ఆర్‌ఎస్‌ కోసం దరఖాస్తు చేసుకున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు అనేక కారణాలతో కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు నాగేశ్వరరావు పేర్కొన్నారు. 20 రోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని ,ప్రతి దరఖాస్తుకు ఎఫ్‌టీఎల్‌, ప్రొహిబిటెడ్‌ అని కొర్రీలు పెట్టి ఇబ్బందిపెడుతున్నా రన్నారు. ధరణిలో పట్టా భూమిగా ఉన్నప్పటికీ అధికారులు ప్రొహిబిటెడ్‌ ల్యాండ్‌లో ఉందని కాలయాపన చేస్తూ ఎల్‌ఆర్‌ఎస్‌ చేయడం లేదన్నారు.సమయం ముగియకముందే ఉన్నతాధికారులు ఎల్‌ఆర్‌ఎస్‌ చేయాలని కోరారు.

ఉత్సాహంగా క్యాడీ క్లాష్‌ గోల్ఫ్‌ టోర్నీ



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలో గోల్ఫ్‌ క్రీడను ప్రమోట్‌ చేస్తున్న టీ గోల్ఫ్‌ ఫౌండేషన్‌ మూడో వార్షిక క్యాడీ టోర్నమెంట్‌ ఉత్సాహంగా జరిగింది. గోల్ఫర్లకు హెల్పర్స్‌ గా ఉండే క్యాడీస్‌ కోసం గత మూడేళ్లుగా ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. గచ్చిబౌలిలోని బౌల్డర్‌ హిల్స్‌ గోల్ఫ్‌ కంట్రీ క్లబ్‌ వేదికగా జరిగిన ఈ టోర్నీలో 140 మంది క్యాడీస్‌ పాల్గొన్నారు. గత ఏడాది జరిగిన టోర్నీలో 100 మంది క్యాడీస్‌ ఆడగా.. ఈ సారి వారి సంఖ్య మరింత పెరిగింది. గోల్ఫ్‌ క్రీడలో కీలకంగా వ్యవహరించే క్యాడీస్‌లో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించే ఉద్దేశంతోనే దీనిని నిర్వహిస్తున్నట్టు టీ గోల్ఫ్‌ ఫౌండేషన్‌ ఫౌండర్‌ డాక్టర్‌ ఎన్‌ఆర్‌ఎన్‌ రెడ్డి చెప్పారు. క్యాడీస్‌ కోసమే కాకుండా గోల్ఫ్‌ క్రీడను ప్రమోట్‌ చేసే క్రమంలో పనిచేసే వర్కర్లకు , ఇతర సిబ్బందికి టీ గోల్ఫ్‌ ఫౌండేషన్‌ తరపున మెడికల్‌ క్యాంపులు సైతం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్యాడీస్‌ టోర్నీ 2025లో లాంగెస్ట్‌ డ్రైవ్‌లో సల్మాన్‌ , స్ట్రెయిట్‌ డ్రైవ్‌లో పవన్‌, క్లోజెస్ట్‌ పిన్‌లో మహేష్‌ , కేటగిరీ 1లో మహేశ్‌, కేటగిరీ 2లో గణేశ్‌ , బీఆర్‌ మూర్తి విజేతలుగా నిలిచారు. విజేతలకు టీ గోల్ఫ్‌ ఫౌండేషన్‌ ఫౌండర్‌ డాక్టర్‌ ఎన్‌ఆర్‌ఎన్‌ రెడ్డి, ఎమ్మార్‌ ప్రాపర్టీస్‌ ప్రతినిధి మధుసూదన్‌ రావు ట్రోఫీలు అందజేశారు.

భెల్‌లో క్రీడా పోటీలు



క్రీడలను ప్రారంభిస్తున్న భెల్‌ ఈడీ కె.బి.రాజా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మేడేను పురస్కరించుకుని బీహెచ్‌ఈఎల్‌ టౌన్‌షిప్‌లో భెల్‌ యాజమాన్యం కార్మికులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భెల్‌ ఈడి కె.బి.రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం గంట సమయం క్రీడలకు కేటాయించడం వలన ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. క్రికెట్‌, వాలీబాల్‌, బాస్కెట్‌బాల్‌, మహిళ కార్మికులకు త్రోబాల్‌, షటిల్‌, బ్యాడ్మింటన్‌, పిడబ్ల్యూడి ఉద్యోగులకు చెస్‌, క్యారమ్‌ పోటీలు ఉంటాయని, రెండురోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో జీఎంహెచ్‌ఆర్‌ డాక్టర్‌. సంధ్య, ఏఐటీయూసీ అధ్యక్షులు కృష్ణంరాజు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించండి



గోపీనగర్‌లో డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్‌కు చూపిస్తున్న స్థానికులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌ గోపీనగర్‌లో కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ మంగళవారం పర్యటించారు. దర్గా, చర్చి బస్తీల్లో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే రోడ్ల నిర్మాణం చేపట్టాలని వాటర్‌వర్క్స్‌, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ భాస్కర్‌, వాటర్‌ వర్క్స్‌' మేనేజర్‌ అభిషేక్‌రెడ్డి, ఎలక్ట్రిక్‌ ఏఈ వెంకట్‌రామ్‌రెడ్డి, నాయకులు యాదాగౌడ్‌, దస్తగిరి, రవి,గఫూర్‌, అశోక్‌, రజాక్‌, ఖాజా, నాని, బాలస్వామి, చంద్రమౌళి, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి



మియాపూర్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌ మదీనాగూడ మైత్రి కమాన్‌ వద్ద ఓ మహిళా గాయాలతో పడి ఉందని మంగళవారం తెల్లవారు జామున మియాపూర్‌ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళను పరిశీలించారు. ఆమె వయస్సు (సుమారు 40–45) సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.మదీనాగూడ రహదారిపై డీసీఎం డ్రైవర్‌ అజాగ్రత్తగా వాహనం నడిపి మహిళను ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఉదయం 8 గంటలకు మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మియాపూర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎయిర్‌ కూలర్‌.. కూలింగ్‌ పక్కా



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూలర్లు

- భారీగా కొనుగోలు చేస్తున్న ప్రజలు
- రూ.2 వేల నుంచి రూ.15 వేల వరకు పలుకుతున్న ధరలు

పటాన్‌చెరు టౌన్‌: ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. రోజు రోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరిగి చల్లదనాన్ని వెతుక్కుంటున్నారు. దీంతో పట్టణంలోని మార్కెట్‌లో కూలర్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. కూలర్లకు డిమాండ్‌ పెరగడంతో వ్యాపారులు వాటి రేట్లను కూడా అమాంతంగా పెంచేస్తున్నారు.

వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. పటాన్‌చెరువాసులు పగటి పూట వేడి తట్టుకోలేక పట్టణంలోని స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో చెట్ల కింద సేదతీరుతుంటే మరికొందరు కూలర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రజల అవసరాలకనుగుణంగా మార్కెట్‌లోకి సరికొత్త డిజైన్‌లతో కూలర్లు వస్తున్నాయి. పేరొందిన కంపెనీల కూలర్లకు తీసిపోనివిధంగా అసెంబుల్‌ మోడల్‌ కూలర్లు క్షణాల్లో తయారు చేసి ఇస్తున్నారు. సాధారణ కూలర్లు రూ.రెండు వేల నుంచి 15 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. ఏప్రిల్‌ ప్రారంభంలో ఎండ తీవ్రత అంత లేకపోవడంతో కూలర్ల అమ్మకాలు అంతంతే ఉన్నాయని..ప్రస్తుతం ఏప్రిల్‌ చివరి వారం నుంచి అమ్మకాలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే బయటకు రావడం లేదు. ఇళ్లల్లో కూలర్ల కింద సేదదీరుతున్నారు. సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అయితే కూలర్లు రెండు రకాలు ఉన్నాయని లోకల్‌ కంపెనీకి చెందిన కూలర్లు రూ.2వేల నుంచి 6 వేల వరకు ఉన్నాయని , బ్రాండెడ్‌ కంపెనీకి చెందిన కూలర్లు రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

అందుబాటు ధరలో కూలర్లు



ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూలర్ల వైపు చూస్తున్నారు. దీంతో కూలర్ల అమ్మకాలు పెరిగాయి. అందరికీ అందుబాటు ధరలో కూలర్లు ఉన్నాయి.

– శ్రీహరి, వ్యాపారి, పటాన్‌చెరు

మధ్య తరగతి వారికి కూలర్‌లే ఏసీలు



వేసవి వచ్చిందంటే మధ్య తరగతి వారు కూలర్లనే కొనుగోలు చేస్తుంటారు. ఏప్రిల్‌ చివరి వారం నుంచి ఎండలు పెరిగాయి. మే నెలలో ఎండలు అధికంగా ఉంటాయని కూలర్‌ కొనేందుకు వచ్చాను.

– నాగేష్‌, పటాన్‌చెరు